క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

మహేశ్వరం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశం హాలులో ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్ సునితా అంధ్యా నాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ నర్సింహా తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో మండలంలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కార మార్గాలను చూసుకోవాలన్నారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వాల్మీకి జీవితం ఆదర్శం



వాల్మీకి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: వాల్మీకి మహర్షి జీవితం మానవాళికి ఆదర్శమని మామిడిపల్లి 11వ డివిజన్ కార్పొరేటర్ సుక్క శివకుమార్ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గ్రామ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ వేటగాడిగా జీవితాన్ని కొనసాగిస్తూ.. మహర్షిగా మారి రామాయణాన్ని రచించారని గుర్తు చేశారు. మనిషిలో మార్పు వస్తే మహర్షి కాగలరని నిరూపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్, యాదగిరి, బాబు, శివ శంకర్, రంగనాథ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ సంస్థకు జరిమానా

మహేశ్వరం: నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థకు తెలంగాణ రెరా(తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులటరీ అథారిటీ) జరిమానా విధించింది. మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 65,66,66/ఈ2లో 11 ఎకరాల విస్తీర్ణంలో సిటీ ఫ్రంట్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ 2019లో వెంచర్ ఏర్పాటు చేసింది. ప్లాట్లను యజమాని సుమంత్ విక్రయించారు. బ్రోచర్‌లో ముద్రించిన విధంగా క్లబ్ హౌస్ నిర్మాణం చేయకపోవడం, ఇతర సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేశారు. ప్లాట్ కొనుగోలు చేసిన సుధాకర్ అనే వినియోగదారుడు హెచ్‌ఎండీఏ రెరాకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించిన అధికారులు.. నిబంధనల ప్రకారం నిర్మాణాలు, వసతులు లేకపోవడంతో వెంచర్ నిర్మాణం చేసిన సిటీ ఫ్రంట్ రియల్ ఎస్టేట్ సంస్థ, ఆమెజ్ కన్‌స్ట్రక్షన్ డెవలపర్స్ సంస్థలకు రూ. 2,56,500 జరిమానా విధించారు.

సయ్యద్ ఫెరోజ్‌కు సన్మానం



సయ్యద్ ఫెరోజ్‌ను సన్మానిస్తున్న ఉద్యమకారులు

పహాడీషరీఫ్: ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు సయ్యద్ ఫెరోజ్ జ్ఞాపికను అందజేసి సన్మానించారు. శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యమకారుల సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో దయానంద్ ముదిరాజ్, వెంకటేశ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 17, వంకాయ 23, బెండ 28, పచ్చిమిర్చి 40, కాకర 23, బీర 28, క్యాబేజీ 16, ఫ్రెంచిబీన్స్ 75, క్యారెట్ 37, దొండ 13-15, చిక్కుడు 40-55, గోకర 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 45, ఆలు 21, దోస 13, సొర 9, పొట్ల 13, ఉల్లిగడ్డ 50, చామగడ్డ 37. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సభకు తరలిన నేతలు

మొయినాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్లలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌కు ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత బట్టి విక్రమార్క తదితరులు హాజరైన కార్నర్ మీటింగ్‌కు మొయినాబాద్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు,ప్రజలు భారీగా తరలివెళ్లారు.



సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు

- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాగుల్‌దోని తండా మహేశ్వరం, గంగారం, రామచంద్రగూడ గ్రామాల కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తనను మళ్లీ భారీ మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే అభివృద్ధి వెనక్కి పోతుందని, మళ్లీ చీకటి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, జిల్లా రైతు కమిటీ సభ్యులు యాదయ్య, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు, కార్యదర్శి మల్లేష్‌యాదవ్, అంజయ్యముదిరాజ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే

- కేసీఆర్ హామీలతో మోసం చేశారు
- జైపాల్‌యాదవ్ అసమర్థ నాయకుడు
- కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఆకుతోటపల్లి, సింగంపల్లిలో కాంగ్రెస్ ప్రచారం
- హస్తం గూటికి నేతలు



సభలో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో రాబోయేది ఇందిరమ్మ రాజ్యమేనని, బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తప్పక పరిష్కారం ఉంటుందని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తామని పేర్కొన్నారు. శనివారం ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి, సింగంపల్లి గ్రామాల్లో నారాయణరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంల గురించి వివరించారు. అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను గుర్తించిన ఏఐసీసీ నేత సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తుచేశారు. అయితే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా పాలన సాగిస్తోందని మండిపడ్డారు.

గెలిపిస్తే ప్రజలకు సేవచేస్తా

సీఎం కేసీఆర్ నియంత పాలన సాగిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని, ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని భరోసా ఇచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అసమర్థత వలన నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని ఆరోపించారు. తనను గెలిపిస్తే ప్రజల కోసం నిరంతరం సేవకుడిలా పనిచేస్తానని కసిరెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు ఎంపీపీ అనిత, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహ, ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, ఆమనగల్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, శెట్టిపల్లి సర్పంచ్ సత్యం, కాంగ్రెస్ నాయకులు రాములు, కృష్ణనాయక్, రాజశేఖర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఆమనగల్లు పట్టణంలో జరిగిన కార్యక్రమంలో కసిరెడ్డి నారాయణరెడ్డి, సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బాలాజీసింగ్, శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణానికి చెందిన వైఎస్సార్‌టీపీ నాయకులు రహీం, పలువురు మైనార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

'గ్యారంటీ'గా అమలు చేస్తాం

తలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని కల్వకుర్తి నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రకటించారు. శనివారం మండల పరిధిలోని ఖానాపూర్‌లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, అందువల్లే వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందం పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం రానుందని జోస్యం చెప్పారు. హస్తం గుర్తుకు ఓటు వేసి అఖండమైన మెజార్టీతో గెలుపించాలని అభ్యర్థించారు. కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలంతా బీజేపీతోనే..



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నరేశ్ తదితరులు

పహాడీషరీఫ్: బీజేపీ హయాంలోనే బహుజనులకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ బడంగ్‌పేట్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నరేశ్ యాదవ్ అన్నారు. తెలంగాణలో బీజేపీ గెలిస్తే బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే శనివారం బీజేపీ నాయకులు మామిడిపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అగ్రవర్ణాలకే ఎక్కువ టికెట్లు కేటాయించాయని దుయ్యబట్టారు. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అమిత్ షా ప్రకటనతో బీసీలంతా బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో అందెల శ్రీరాములును గెలిపించాలని కోరారు. వేణు, గణేశ్ గౌడ్, పురుషోత్తం, రంగనాథ్, బాబు, రాంచందర్, కృష్ణ, పాల్గొన్నారు.

బీజేపీలో యువకుల చేరిక



బీజేపీలో చేరుతున్న యువకులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షుడు ముఖేష్ ఆధ్వర్యంలో జిల్లెలగూడ లలితానగర్, వెంకటగిరి కాలనీలకు చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మహేశ్వరం బీజేపీ అభ్యర్థి శ్రీరాములు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక ఇంటి పన్నులు, నల్లా బిల్లుల భారంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కదారి జంగయ్య యాదవ్, మీర్‌పేట పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, నాయకులు జంగయ్య, జగన్, వెంకట్‌రెడ్డి, సత్తయ్య, నర్సింహ, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించండి



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలని స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. శనివారం కడ్తాల్‌లో గడప గడపకు తిరుగుతూ బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోలోని అంశాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్నయ్య, ఉప సర్పంచ్ రామకృష్ణ, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు నర్సింహ, నరేందర్‌రెడ్డి, బిక్షపతి, గణేశ్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు హస్తినాపురానికి మంత్రి కేటీఆర్ రాక

హస్తినాపురం: హస్తినాపురంలోని జీఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ బూత్ వారియర్స్, కోఆర్డినేటర్స్ సమావేశం జరగనుందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పురపాలక శాఖమంత్రి కేటీఆర్ హాజరవుతారని ఆయన చెప్పారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు.

ఆలయానికి విరాళం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని భక్తమార్కండేయస్వామి ఆలయ అభివృద్ధికి ఆమనగల్లు పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు అప్పం రాఘవ, ఉదయశ్రీ దంపతులు రూ.3 లక్షల విరాళం అందజేశారు. ఆలయంలో ఇటీవల కమ్యూనిటీ హాలు నిర్మించాలని భావించారు. అయితే నిధుల కొరతతో నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఈ మేరకు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రాఘవ దంపతులు రూ.3 లక్షలు పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణకు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, రవి, అప్పం శ్రీను, ఈశ్వరయ్య, గిరి, రాజు, పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

కందుకూరు: అసెంబ్లీ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేలా గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. శనివారం సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ బృందం మండల పరిధిలోని లేమూరు, మాదాపూర్, తిమ్మాపూర్, గుమ్మడవెల్లి, రాచులూరు, బేగంపేట గ్రామాల్లో కవాతు నిర్వహించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



రాచులూరులో కవాతు

అవేర్ సంస్థల ఆస్తులను కాపాడాలి

- ఆస్పత్రి ఎదుట నిరసన



అవేర్ ఆస్పత్రి ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

తలకొండపల్లి: అవేర్ సంస్థల ఆస్తులను కాపాడాలని స్థానిక ఉప సర్పంచ్ తిరుపతి కోరారు. మండల పరిధిలోని దేవుని పడకల్‌లో 1975లో అవేర్ సంస్థల ఆధ్వర్యంలో 30 పడకల ఆస్పత్రిని నిర్మించారని తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని స్థానిక నాయకులు ఆస్పత్రి నిర్మాణానికి అప్పట్లో 6 ఎకరాల భూమి దానం చేశారని పేర్కొన్నారు. అయితే ఇటీవల ఆస్పత్రికి కేటాయించిన భూమిని కొందరు వ్యక్తులు అమ్మకానికి పెట్టారని చెప్పారు. దీంతో తిరుపతి ఆధ్వర్యంలో శనివారం ఆస్పత్రి ఎదుట స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భూమిని ప్రభుత్వం ఆ. దీనంలోకి తీసుకొని ప్రజావసరాల కోసం వాడుకోవాలని డిమాండ్ చేశారు. భూమిని ఎవరైనా కొన్నా.. అమ్మిన తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్, అవేర్ సంస్థల సభ్యుడు హర్యానాయక్, రైతు సంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ్, వార్డు సభ్యులు వెంకటేశ్, సత్యం, స్వామిగౌడ్, యాదయ్యగౌడ్, రాములు, కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుడాకాంప్లెక్స్: కారు గుర్తుకు ఓటు వేసి సబితా ఇంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సరూర్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం అంబేడ్కర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓటును అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బోయిని మహేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, పోలె సుధామా, దయాకర్‌రెడ్డి, పందుల రాజు, అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతంలో భక్తులు

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత లక్ష్మీగణపతి దేవాలయంలో శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మారుమ్రోగింది. ఈ పూజల్లో టీటీడీ ధర్మాచార్య జనార్దన్‌రావు, హరినాథ్, వేముల రాజేశ్వర్‌రావు, దేవాలయ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

వర్కర్స్ ఆఫ్ ఇండియా అభ్యర్థిని గెలిపించండి



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సూర్యప్రకాశ్

హుడాకాంప్లెక్స్: వర్కర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు, ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభ్యర్థి రాయబండి పాండు రంగాచారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయాన్ని కొత్తపేట చౌరస్తాలో సూర్యప్రకాశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సిద్ధాంతాల ద్వారానే దేశంలో మార్పు వచ్చిందని, కులం, వర్గం నిర్మూలించి బహుజనులకు రాజ్యాధికారం అందించడానికి ఏర్పడిన ఏకైక ఫ్రంట్ తమ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మారోజు సునీల్‌కుమార్, కొప్పు యాదయ్య, బాణాల ద్రోణాచారి, అబ్బయ్యగౌడ్, మోత్కూర్ మల్లాచారి, మల్లోజుల శేఖర్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లల్లో చోరీ

- దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు, రిమాండ్



బళ్లారి అజయ్, నిందితుడు

ఇబ్రహీంపట్నం: తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని ఇబ్రహీంపట్నం పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో వివిధ కేసుల్లో జైల్ కెళ్లిన అతడు ఎనిమిది రోజుల క్రితం విడుదలయ్యాడు. ఐనప్పటికీ అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోగా తిరిగి పాత దారినే ఎంచుకున్నాడు. చివరికి పోలీసులకు చిక్కి అరెస్టయ్యాడు. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం..నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలం ఉట్లకోనేరు గ్రామానికి చెందిన బళ్లారి అజయ్ (24) బడంగ్‌పేట, మీర్‌పేట ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో ఉంటూ టెంట్ హౌస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటుపడిన అతను వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. దీంతో అతను తిరిగి దొంగతనం చేయడాన్నే ఎంచుకున్నాడు. గతంలో లింగాల, పెద్ద కొత్తపల్లి, మీర్‌పేట్, పహాడిషరీఫ్, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు చోరీలకు పాల్పడిన ఘటనలో అజయ్ జైల్‌కు వెళ్లాడు. అక్టోబర్ 20న చర్లపల్లి జైలు నుంచి విడుదలైన అతను ఇబ్రహీంపట్నం గోకుల్‌నగర్‌లోని తెల్లూరి బాలకిషన్ ఇంట్లో గురువారం చోరీకి పాల్పడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి కోసం పోలీసులు గాలించారు. ఉప్పరిగూడ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలో పోలీసుల కన్నుగప్పి పారిపోయేందుకు అతను యత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు అతన్ని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం విచారించగా చేసిన దొంగతనాలను ఒప్పుకున్నాడు. అతని నుంచి అక్టివా ద్విచక్ర వాహనం, రూ.3వేలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రంగారెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరు

- వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి
- మాల్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ



మాల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాచారం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మల్‌రెడ్డి రంగారెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరని వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మాల్ గ్రామంలో శనివారం స్థానిక సర్పంచ్ కవిత ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని పార్టీ శ్రేణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు అరవింద్‌నాయక్, శేఖర్‌గౌడ్, రాజారెడ్డి, మురళీ, అమృతసాగర్, జంగయ్య, తిరుమల్లేశ్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి ఆదర్శనీయుడు

- ఫుడ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గోలి శ్రీనివాసురెడ్డి



పూజలు చేస్తున్న గోలి శ్రీనివాసురెడ్డి తదితరులు

తలకొండపల్లి: వాల్మీకి మహర్షి ఆదర్శనీయుడని ఫుడ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గోలి శ్రీనివాసురెడ్డి కొనియాడారు. శనివారం గట్టుఇప్పలపల్లిలో వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాసురెడ్డి, గౌడ సంఘం తాలుక కన్వీనర్ అశోక్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరిని నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, రాజు, జంగయ్య, వాల్మీకి నాయకులు కిషన్ కొండల్, రమేశ్, నారాయణ, రాఘవేందర్, శంకర్, యాదయ్య, వెంకటయ్య, బన్నీ, విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో మైనార్టీలకు పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ ఖలీల్

ఆమనగల్లు: ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని జిల్లా బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వివిధ రాజకీయ పార్టీలు మైనార్టీలను ఓటు బ్యాంక్‌గా వాడుకుని వారి అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. మహిళల కోసం కుట్టు మిషన్లు పంపిణీ చేసిందని తెలిపారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. మైనార్టీలు బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలని సయ్యద్ ఖలీల్ కోరారు. సమావేశంలో మైనార్టీ నాయకులు జహంగీర్, మహబూబ్, మోయిజ్, షరీఫ్, ఫరుక్, బాబా, అఫ్సర్, హనీఫ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.